క్లుప్తంగా

వైఎన్ కళాశాల ప్లాటినం వేడుకలకు పురంధరేశ్వరి



పురంధరేశ్వరికి ఆహ్వానం అందిస్తున్న దృశ్యం

నరసాపురం: జనవరి నెలలో నిర్వహించే వైఎన్ కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధరేశ్వరిని ఆహ్వానించినట్టు ప్రిన్సిపాల్ సీహెచ్ కనకారావు తెలిపారు. ఆమెను సోమవారం విజయవాడలో కలిశామన్నారు. జనవరి 11న ఉత్సవంలో పాల్గొనేందుకు ఆమె అంగీకరించారని తెలిపారు. కళాశాల కోశాధికారి పోలిశెట్టి రఘురామ్, డీన్ గంధం శ్రీరామకృష్ణ తదితరులు ఉన్నారు. వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు ప్రారంభించామని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చినిమిల్లి సత్యనారాయణ చెప్పారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

మొగల్తూరు: మొగల్తూరులోని కరికాల వర్గానికి చెందిన విద్యార్థులకు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సోమవారం ఆ వర్గానికి చెందిన నాయకులు ఆర్థిక సాయం అందించారు. డిగ్రీ విద్యార్థులకు రూ.5 వేలు, ఇంజినీరింగ్ విద్యార్థులకు రూ.8 వేలు, వైద్య విద్యార్థులకు రూ.25 వేలు చొప్పున 20 మందికి, అనారోగ్యంతో బాధపడుతున్న 10 మందికి రూ.5 వేలు చొప్పున సాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కామాడి లక్ష్మణరావు, కేపీఎస్ ముక్తేశ్వరరావు, పినిశెట్టి మల్లికార్జునరావు, పాలాటి బాలయోగి, బీబీకే శివన్నారాయణ, ఎం కాశీ విశ్వేశ్వరరావు, కరెళ్ల బాబు వీరభద్ర ప్రసాద్, సాయిబాబు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు



ప్రజాదర్బార్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పితాని

పెనుగొండ: నియోజకవర్గంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు, అభివృద్ధికి కృషి చేయనున్నట్టు ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. సోమవారం పెనుగొండ పంచాయతీ వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ శాస్త్రి, ఉప సర్పంచ్ ఆకేటి వరలక్ష్మీ చంటి, నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

పెనుగొండ: వడలిలో సీసీ రోడ్ల నిర్మాణానికి సర్పంచ్ కాసాని విజయలక్ష్మి పెద్దిరాజు సోమవారం శ్రీకారం చుట్టారు. పల్లే పండుగలో భాగంగా మూడు కాలనీల్లో రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప్పలపాటి చంటి, అంగర ప్రసాద్, పేరిచర్ల నాగ శ్రీను, అడ్డగళ్ల నరసింహమూర్తి పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే మాధవనాయుడుకి పరామర్శ



ప్రతాప్ నాయుడు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

నరసాపురం రూరల్: నరసాపురం మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు తండ్రి ప్రతాప్ నాయుడు ఆదివారం మృతి చెందారు. మాధవనాయుడుని ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ సోమవారం పరామర్శించారు. ప్రతాప్ నాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రవీంద్రనాథ్ వెంట పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొని మాధవ నాయుడుని పరామర్శించారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆకివీడు: మండలంలోని ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని పీఆర్‌టీయూ మండల శాఖ ఎంఈఓ సీతారామయ్యకు సోమవారం వినతి పత్రం అందజేశారు. సంవత్సరకాల ఇంక్రిమెంట్ వ్యక్తిగతంగా చెల్లించాలని, ఓపీఎస్ ఉపాధ్యాయులకు పీఎఫ్ బ్యాలెన్స్ చెక్కులు అందరికీ ఇవ్వాలని, ఎన్నికల విధులు నిర్వహించిన వారికి 2023, 24లో టెన్త్, అపాస్ పరీక్షలకు విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు సర్వీస్ రిజిస్టర్‌లో ఈఎల్‌లు నమోదు చేసి, మంజూరు చేయాలని అధ్యక్ష, కార్యదర్శులు విజ్ఞప్తి చేశారు.

ఇష్టారాజ్యంగా ఆటోల పార్కింగ్

- స్టాండ్లు లేక రోడ్లపైనే నిలుపుదల
- ట్రాఫిక్ ఇబ్బందులు
- మితిమీరిన వేగంతో రాకపోకలు
- ప్రజల బెంబేలు



మొగల్తూరు రోడ్డులో ఇష్టానుసారంగా నిలిపి ఉంచిన ఆటోలు

నరసాపురం: పట్టణంలో ఆటోల సమస్య నానాటికీ తీవ్రమవుతోంది. ఆటోలను ఇష్టానుసారం రోడ్లపైనే నిలిపి ఉంచడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మితిమీరిన వేగంతో ఆటోలను తిప్పడం, కనీస వయసులేని చిన్నచిన్న బుడతలు సైతం ఆటో డ్రైవర్ల అవతారం ఎత్తడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. నరసాపురం పట్టణంలో దాదాపు 400కి పైగా ఆటోలున్నాయి. వీటిని నిలిపి ఉంచడానికి ప్రత్యేకంగా ఎక్కడా స్టాండ్లు లేకపోవడం ఇబ్బందులు తలెత్తుతున్నాయి. డ్రైవర్లు ఎక్కడపడితే అక్కడ ఆటోలను నిలిపి ఉంచడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా బస్టాండ్, గుర్రపు బండ్ల స్టాండ్, ఎండు చేపల మార్కెట్ ప్రాంతాల్లో ఆటోల సమస్య ఎక్కువగా ఉంది. ఈ ప్రాంతాల్లో వందల కొద్దీ ఆటోలను రోడ్లపైనే నిలిపి ఉంచుతున్నారు. రద్దీగా ఉండే బస్టాండ్, గుర్రపు బండ్ల స్టాండ్ వద్ద ఆటోలు కారణంగా ప్రమాదాలు ఎక్కువవుతున్నాయి. గడిచిన రెండేళ్లలో పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా ఈ రెండు ప్రాంతాల్లోనే జరగడం విశేషం. అసలే ఇరుగ్గా ఉండే ఈ ప్రాంతాల్లో ఆటోలు ఇష్టానుసారం నిలిపి ఉంచడంతో పరిస్థితి మరింత ప్రమాదంగా మారింది. ఆటోలను నిలిపి ఉంచడమే కాకుండా, అక్కడ నుంచే జనాన్ని ఎక్కించడం చేస్తున్నారు. దీంతో సమస్య మరింత జటిలమైంది.

వేగంపై నియంత్రణేది?

ఆటోలను మితిమీరిన వేగంతో తిప్పడం, పరిమితికి మించి జనాన్ని ఎక్కించుకోవడం సర్వసాధారణంగా మారిపోయింది. ఆటోలపై దృష్టి పెడతామని, ఆటో డ్రైవర్లకు గుర్తింపు కార్డులిస్తామని, కనీస వయస్సు లేని వారు ఆటోలను నడపకుండా చర్యలు తీసుకుంటామని గతంలో ప్రకటించిన పోలీస్‌శాఖ ఆ విషయం పట్టించుకున్న సందర్భం కనిపించలేదు. కొత్తగా గడ్డి బజార్ సెంటర్, కనకదుర్గ ఆలయం వద్ద కూడా ఇష్టానుసారం ఆటోలు నిలుపుతుండటంతో స్థానికులు, అటుగా వెళ్లేవారు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా పోలీస్ శాఖ దృష్టిపెట్టి సమస్యను పరిష్కరించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

సేంద్రియ కూరగాయల విక్రయం

మొగల్తూరు: స్థానిక ప్రభుత్వ కార్యాలయాల ఆవరణంలో సోమవారం రసాయనాలు వేయకుండా జీవామృతం, కషాయాలు ద్వారా పండించిన కూరగాయల విక్రయస్టాల్ ఏర్పాటు చేశారు. వీటిని అధికారులు, కార్యాలయాల సిబ్బంది కొనుగోలు చేశారు. తమ కార్యాలయం వెనుక ఉన్న ఖాళీ స్థలంలో కూరగాయలు పెంచుకోవాలని తహసీల్దార్ కె.రాజకిశోర్, ఎంపీడీఓ త్రిశూలపాణిలు రైతులకు సూచించారు.

అల్లు అర్జున్ పై వ్యాఖ్యలు సరికాదు

పెనుగొండ: సినీ నటుడు అల్లు అర్జున్‌ను కించపరుస్తూ పోలీసులు వ్యాఖ్యలు చేయడం సరికాదని, ఏసీపీ విష్ణుమూర్తి తక్షణం క్షమాపణ చెప్పాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు పాలసత్తి రామిరెడ్డి (రాజా) డిమాండ్ చేశారు. పెనుగొండలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సంధ్య థియేటర్‌లో మహిళ మరణించడం, బాలుడు గాయపడడం బాధాకరమైన విషయమేనన్నారు. పోలీసులు ప్రెస్‌మీట్‌లు పెట్టి అల్లు అర్జున్‌ను ఏకవచనంతో అవమాన పరుస్తూ వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. అల్లు అర్జున్‌పై చేసిన వ్యక్తిగత విమర్శలను వెనక్కి తీసుకోవాలని కోరారు.

హైందవ శంఖారావంపై ప్రచారం

మొగల్తూరు: విజయవాడలో జనవరి 5న నిర్వహించే హైందవ శంఖారావం సభకు తరలి రావాలని కోరుతూ సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు సోమవారం మొగల్తూరు మండలం పాతపాడు గ్రామంలో ఇంటింట ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో తమ్ము వెంకట రమణమూర్తి, కొపనాతి ఏడుకొండలు, ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు పాల్గొన్నారు.

ధనుర్మాస పూజలు



శివదేవస్వామి

పాలకొల్లు అర్బన్: ప్రముఖ వాయు త్రిలింగ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శివదేవుని చిక్కాలలోని పార్వతీ సమేత శివదేవస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు చేశారు. అర్చకులు సోమవారం దత్తాత్రేయ స్వామికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ కేవీ సాగర్, గ్రామ పెద్దలు పర్యవేక్షించారు.

పీడబ్ల్యూడీ గ్రౌండ్స్‌లో వ్యాపార కేంద్రాలు వద్దు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విజయవాడలోని పీడబ్ల్యూడీ గ్రౌండ్స్‌లో సామాజిక న్యాయ మహాశిల్పం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్థలంలో రాష్ట్ర ప్రభుత్వం రైతు బజారు, డ్వాక్రా బజారు, ఇతర వ్యాపార కేంద్రాలుగా మార్చడాన్ని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు ఖండించారు. డ్వాక్రా బజార్ షెడ్ల నిర్మాణాన్ని వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ విగ్రహం ఉన్న ఖాళీ స్థలంలో మిగిలిపోయిన కట్టడాలను పూర్తి చేయాలని, ప్రజలందర్జీకీ అందుబాటులోకి తీసుకురావాలన్నారు. దళితులపై జరుగుతున్న దౌర్జన్యాలపై, ఘటనలపై దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరంతరం ఉద్యమం చేపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో టి.శివ, బాలస్వామి, కోటేశ్వరరావు, అప్పన్న, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లో రైతులకు సన్మానం



పొలాల్లో రైతులను సన్మానిస్తున్న దృశ్యం



రైతు వేషధారణలో జె బీరా విద్యార్థులు

పాలకొల్లు సెంట్రల్: యునైటెడ్ కాపు వనిత క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ రైతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం కాపు వనిత క్లబ్ సభ్యులు పెనమదం గ్రామంలో పొలాల వద్దకు వెళ్లి రైతులను సన్మానించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు యామన విజయలక్ష్మి మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతులను గౌరవించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ దేవరపు కాంచనమాల, ట్రెజరర్ శిద్దిరెడ్డి శైలజా రాణి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో రైతు దినోత్సవం

నరసాపురం రూరల్: రైతు దినోత్సవాన్ని నరసాపురంలోని గొందిమూల ప్రాథమిక పాఠశాల, సీతారామపురం జె బీర పాఠశాలల్లో నిర్వహించారు. విద్యార్థులు రైతు వేషధారణలో పొలాల్లో పనులు చేస్తూ ఆకట్టుకున్నారు. పొలం పనులపై ఉపాధ్యాయులు వివరించారు. అనంతరం జైకిసాన్ అంటూ ర్యాలీ నిర్వహించారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న వినుకొండ రవి

యలమంచిలి: మండలంలోని ఏనుగువానిలంక హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ స్టడీ మెటీరియల్‌ను వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామ మాజీ సర్పంచ్ వినుకొండ రవి, ఎంపీటీసీ సభ్యురాలు ధనలక్ష్మి సోమవారం అందజేశారు. గత ఐదేళ్లుగా వినుకొండ రవి దంపతుల ఆర్థిక సాయంతో ఈ స్టడీ మెటీరియల్ విద్యార్థులకు అందిస్తున్నట్టు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ యూటీఎఫ్ ఉపాధ్యాయులు శ్రమకోర్చి ప్రతి ఏటా ఈ మెటీరియల్ తయారు చేయడం ప్రశంసనీయమన్నారు. విద్యార్థులు ఈ మెటీరియల్ సద్వినియోగం చేసుకుని పబ్లిక్ పరీక్షలో అత్యధిక మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఈద ప్రమీల సువర్ణరాజు, ప్రధానోపాధ్యాయులు అవధాని, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ నారిన వెంకట రామకృష్ణ, వైస్ చైర్మన్ వేంద్ర లక్ష్మి, యూటీఎఫ్ జిల్లా కోశాధికారి పోలిశెట్టి క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గణిత మేధావికి ఘన నివాళి



రామానుజన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైస్ ప్రిన్సిపాల్ కృష్ణ

పాలకొల్లు సెంట్రల్: జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. రామానుజన్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ మాటాడుతూ రామానుజన్ 13 ఏళ్ల వయసులోనే త్రికోణమితిని అధ్యయనం చేయటమే కాక కొన్ని సూత్రాలను కూడా కనిపెట్టారని గుర్తుచేశారు. ఒకేసారి 120 సిద్ధాంతాలు కనిపెట్టి కేంబ్రిడ్జి యూనివర్శిటీలోనే హార్డి అనే గణిత మేధావికి పంపించగా అతను ఆశ్చర్యపోయి వెంటనే ఇంగ్లాండ్‌కు రావాలని పిలుపునిచ్చారని వివరించారు. 1729ని రామానుజన్ సంఖ్య అని పిలుస్తారని తెలిపారు. కార్యక్రమంలో గణిత శాస్త్ర అధ్యాపకులు కే శివకృష్ణ, బిగేవి రామలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

కంటి చూపుపై జాగ్రత్తలు పాటించాలి



కంటి శిబిరం ప్రారంభోత్సవంలో రవీంద్రనాథ్

పెనుగొండ : కంటి చూపు విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. సోమవారం పెనుగొండలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దివంగత జక్కం బలరామ్ స్వామి, లీలావతి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన కంటి పరీక్షా కేంద్రాన్ని ఎమ్మెల్సీ రవీంద్రనాథ్ ప్రారంభించి మాట్లాడారు. ప్రతి బుధవారం పాలకొల్లు లయన్స్ కంటి ఆస్పత్రి వైద్య బృందం పెనుగొండలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లయన్స్ గవర్నర్ కాకరాల వేణుబాబు మాట్లాడుతూ గ్రామీణుల కంటి చూపు పరిరక్షణే లక్ష్యంగా పరీక్షా కేంద్రాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా గాజుల బులిపుల్లారావు పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు కార్యక్రమంలో బాబూజీరావు, డాక్టర్ సీహెచ్ సత్యనారాయణ మూర్తి, డి.సుబ్బారావు, దామోర్ల రంగారావు, వేమా కోటేశ్వరరావు, ఎన్వీవీఎస్ పాపారావు నాయుడు, కేసీఆర్ నర్సింహరావు, లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు జక్కం విజయ్ కుమార్, గుమ్మడి చంటి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై స్పందించకుంటే ఫిర్యాదు చేయండి



కార్యక్రమంలో సమస్యలు వింటున్న ఆర్డీఓ రాజు

నరసాపురం: ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో అధికారులు స్పందించకపోతే తనకు ఫిర్యాదు చేయాలని ఆర్డీఓ దాసి రాజు సూచించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ(మీకోసం) కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదు స్వీకరించారు. డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 34 ఫిర్యాదులు అందాయన్నారు. ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే మీకోసం లక్ష్యమన్నారు. ప్రజా ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, వీటిపై ఎప్పటికప్పుడు తనకు నివేదిక ఇవ్వాలని ఆర్డీఓ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డివిజన్‌లోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు



యలమంచిలి లంకలో అర్జీలు స్వీకరిస్తున్న డీటీ డేవిడ్‌సన్

యలమంచిలి: భూ సమస్యలు పరిష్కారం కోసం గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ పూడి డేవిడ్‌సన్ రైతులకు సూచించారు. యలమంచిలిలంక, కట్టుపాలెం గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. యలమంచిలిలంకలో 11, కట్టుపాలెంలో 10 దరఖాస్తులు వచ్చాయని డీటీ తెలిపారు. సర్పంచ్‌లు వల్లభు సాయి వెంకట నరసింహారావు, పొన్నమండ నాగరాజు, వీఆర్వోలు అడబాల బాబ్జి, ఎం రమేష్, కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా చెరువులకు అనుమతులు ఇవ్వొద్దు



కాళ్ల తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న కాలనీ వాసులు

కాళ్ల: జనావాసాల మధ్య చెరువులకు అనుమతులు ఇవ్వొద్దని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జగనన్న కాలనీ వాసులు సోమవారం ఫిర్యాదు చేశారు. పెదపాటి దిబ్బ ఏరియాలో జగనన్న కాలనీలో నివసిస్తున్న సుమారు 120 కుటుంబాలు జీవిస్తున్నాయని తెలిపారు. ఇప్పటికీ ఈ కాలనీకి దక్షిణం, ఉత్తరం వైపున ఆక్వా చెరువులు ఉండడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రస్తుతం కాలనీకి పడమర వైపు ఉన్న పొలాలను చెరువులుగా చేసేందుకు కొంత మంది ఆక్వా రైతులు ప్రయత్నం చేస్తున్నారని, అనుమతులు ఇస్తే తామంతా కాలనీని ఖాళీ చేసి రోడ్డున పడాల్సి వస్తుందని వాపోయారు. ఇప్పటికే రోడ్డు పక్కన నివాసాలు ఉన్న తమ ఇళ్లను తొలగించడంతో రోడ్డున పడి తీవ్ర మానసిక క్షోభకు గురయ్యామని, ఇప్పుడు కాలనీకి ఆనుకొని ఆక్వా చెరువులు తవ్వితే వాటి ద్వారా వచ్చే కాలుష్యం వల్ల తామంతా అనారోగ్యానికి గురవుతామన్నారు. ఉన్నత అధికారులు స్పందించి ఆక్వా చెరువుల తవ్వకానికి అనుమతులు మంజూరు చేయకుండా చూడాలని కోరారు.

గోతులతో ప్రజలకు ఇబ్బందులు



పెనుగొండ వంతెనపై గోతులను చూపుతున్న నాయకులు

పెనుగొండ: పెనుగొండ వంతెనపై గోతుల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి షేక్ పాదుషా అన్నారు. సోమవారం పెనుగొండ ఫ్లై ఓవర్‌పై ఏర్పడిన గోతులను ఆ పార్టీ నాయకులు పరిశీలించారు. ఆర్అండ్‌బీ అధికారులు తరచూ వంతెన పై గోతులు పూడుస్తున్నా, మరిన్ని గోతులు పడి వంతెనను బలహీన పరుస్తున్నాయని తెలిపారు. వంతెన నిర్వహణ సక్రమంగా చేపట్టి, మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మాదాసు నాగేశ్వరరావు, పెనుగొండ గ్రామ కార్యదర్శి నాగివెట్టి గంగారావులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి



హెల్మెట్ అవగాహన పోస్టర్ ను ఆవిష్కరిస్తున్న జిల్లా ఎస్పీ నాయిమ్ అస్మి

భీమవరం(ప్రకాశంచౌక్): భద్రత కోసమే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని ఎస్పీ నయిమ్ అస్మి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ కార్యాలయంలో హెల్మెట్ అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించి సురక్షితంగా ఉండాలన్నారు. హెల్మెట్ ధరించడంపై ప్రభుత్వంతోపాటు స్వచ్ఛంద సంస్థలు అవగాహనా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ జిల్లా ఎస్పీ సహకారంతో ఈ ప్రచార అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నామని, అందరూ ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ దేశంశెట్టి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు

భీమవరం (ప్రకాశంచౌక్): ఈ నెల 25వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కోర్బాలో జరిగే 68వ జాతీయ స్థాయి నెట్ బాల్ అండర్ –19 పోటీలకు భీమవరం డాక్టర్ సీఎస్‌ఎన్ విద్యార్థులు ఫణీంద్ర కుమార్, టి.కేశవ మణికంఠలు ఎంపికయ్యారని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ సలీంఖాన్ తెలిపారు. ఇటీవల నెల్లూరు జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 19నెట్ బాల్ పోటీల్లో పశ్చిమగోదావరి జిల్లా బాలుర జట్టు ప్రథమస్థానం సాధించినట్లు తెలిపారు. సీఎస్‌ఎన్ కళాశాల నుంచి ఇద్దరూ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ దావూద్‌ఖాన్ తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులని భీమవరం డాక్టర్ సీఎస్‌ఎన్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ చీడే సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపల్ ఎండి సలీం ఖాన్ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్టు

భీమవరం అర్బన్: భీమవరం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. బలరామరాజు తన సిబ్బందితో ఎల్‌వీఎన్‌పురంలో బెల్ట్ షాపుపై దాడులు చేశారు. బెల్ట్ షాపు నిర్వహిస్తున్న పాలా గణపతిని అదుపులోకి తీసుకుని ఆయన వద్ద నుంచి 8 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. మండలంలో ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఎస్సైలు పీవీవీఎస్ ఉమా మహేశ్వరరావు, పి. సునీల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.